

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 28-05-2025 | సంపుటి - 24 | సంచిక - 25 | రూ : 4 | పేజీలు: 8




## పద్మాలు అందుకున్న ప్రముఖులు

- తెలంగాణ నుంచి మందకృష్ణ
- ఏపీ నుంచి కేఎల్ కృష్ణ, రాఘవేంద్రాచార్య

2లో

## ఉగ్రవాదమే పాకిస్థాన్ యుద్ధనీతి



- ఆ వ్యూహాన్ని మన దేశం గట్టిగా తిప్పికొడుతుంది
- అహ్మదాబాద్‌లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

గాంధీనగర్ : పాకిస్థాన్ ఆచరిస్తున్న ఉగ్రవాదం పరోక్ష పోరు కాదని.. ఉద్దేశపూర్వక యుద్ధ వ్యూహమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ వ్యూహాన్ని తిప్పి కొట్టడానికి భారత్ గట్టిగా బదులిస్తుందని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగించడం ద్వారా పొరుగుదేశం యుద్ధంలో కొనసాగుతోందన్నారు. "వసుధైక

## ఈసారి వర్షా లు పుష్కలం!.. ఐఎండీ అంచనా

దిల్లీ, ఈనాడు, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈ సారి దేశంలో పుష్కలంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది.

తరువాయి 2లో



## అందాల పోటీల ఫైనల్‌కి కౌంట్‌డౌన్

- టాప్ 40లో ఇప్పటికే 12 బెర్త్‌లు ఖరారు
- మిగిలిన వారిని ఎంపిక చేయనున్న న్యాయనిర్ణేతలు
- 31న జరిగే కార్యక్రమానికి హైటెక్స్‌లో ఏర్పాట్లు

హైదరాబాద్: మిస్ వరల్డ్ 2025 ఫైనల్ పోటీలకు కౌంట్‌డౌన్ మొదలైంది. క్వార్టర్ ఫైనల్‌కు చేరిన 40 మంది అందాలభామలు ఫైనల్‌లో ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడతారు. ఇప్పటివరకు స్పోర్ట్స్ ఛాలెంజ్‌లో ఒకరు, టాలెంట్ ఛాలెంజ్‌లో ఒకరు, హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో నలుగురు, టాప్ మోడల్ పోటీల్లో నలుగురు, బ్యూటీ విత్ ఏ పర్పస్ విభాగం నుంచి నలుగురు.. మొత్తం 14 మంది విజేతలై

తరువాయి 2లో








## మళ్లీ ఏపీ హైకోర్టుకు జస్టిస్ బట్టు దేవానంద్

- తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి
- జస్టిస్ సుజయ్‌పాల్ కలకత్తా హైకోర్టుకు బదిలీ
- జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ లలిత, జస్టిస్ సుమలత మళ్లీ తెలంగాణ ఉన్నత న్యాయస్థానానికి
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు
- 10 హైకోర్టులకు చెందిన 21 మంది న్యాయమూర్తుల బదిలీ

**మే 27, దిల్లీ:** దిల్లీ: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళ్లిన జస్టిస్ బట్టు దేవానంద్‌ను మళ్లీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలో తొలిసారి సమావేశమైన కొలీజియం.. 10 రాష్ట్రాలకు చెందిన 21 మంది న్యాయమూర్తులను బదిలీ చేయాలని నిర్ణయించింది. అందులో జస్టిస్ బట్టు దేవానంద్ కూడా ఉన్నారు. 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. మద్రాస్ హైకోర్టుకు బదిలీపై వెళ్లి 2023 ఏప్రిల్ 10న అక్కడ బాధ్యతలు తీసుకున్నారు. జస్టిస్ బట్టు దేవానంద్ 1966 ఏప్రిల్ 14న జన్మించారు.

తరువాయి 2లో

## వాయుసేనకు నూతన శక్తి!




- ఐదో తరం యుద్ధవిమానం తయారీలో ముందడుగు
- 'ఆమ్కా' ప్రాజెక్టు 'ఎగ్జిక్యూషన్ నమూనా'కు రక్షణ శాఖ ఆమోదం
- దేశీయ పరిజ్ఞానానికి పెద్దపీట

2లో

## ఏపీ దశ, దిశ మారుస్తాం..

- అందుకు అవసరమైన విధానాలు రూపొందిస్తాం
- పసుపు సైనికుల త్యాగాల ఫలితమే ఈ అధికారం
- అందుకు తగిన గుర్తింపు, గౌరవం ఇస్తాం
- కార్యకర్తల ద్వారా పాలనే నిజమైన పొలిటికల్ గవర్నెన్స్
- మూడు పార్టీలు కలిసి నడవాలి.. కలిసి గెలవాలి..
- గత పాలకుల కుంభకోణాల లెక్కలు తీస్తున్నాం
- దోపిడీదారులు, గాడి తప్పిన నేతలు, అధికారులకు శిక్ష తప్పదు
- తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు
- ఘనంగా ప్రారంభమైన మహానాడు వేడుకలు



2లో

# అధిక ప్రాధాన్యం రైతు సంక్షేమానికే

**అకాల వర్షా లతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం**

- అధికారులు నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు పంపించాలి
- జూన్ 3 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా భూభారతి రెవెన్యూ సదస్సులు
- ఎరువులు, విత్తనాల కొరత రానివ్వం.. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై పీడీ యాక్ట్
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఉచిత ఇసుక సరఫరా
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గతంలో కంటే 22 లక్షల టన్నుల ధాన్యం ఎక్కువగా కొనుగోలు చేశామని వెల్లడి



2లో

# అధిక ప్రాధాన్యం రైతు సంక్షేమానికే

హైదరాబాద్: రైతుల శ్రేయస్సు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు ముందుగానే కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు వర్షాల వల్ల ధాన్యం విక్రయంలో కొందరు రైతులకు ఇబ్బందులు తలెత్తాయని.. వారికి అండగా నిలవాలన్నారు. ధాన్యం విక్రయంలో రైతుల్ని ఇబ్బందులకు గురిచేసే మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోళ్లు, వానాకాలం పంటకు వ్యవసాయ శాఖ సన్నద్ధతపై సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ సహా కొందరు మంత్రులు జిల్లాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సుల్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమల్లో కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. "అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటాం. ఎకరానికి రూ.10 వేల పరిహారం అందించేందుకు నివేదిక తయారు చేసి అధికారులు ప్రతిపాదనలు పంపాలి. వర్షాలు ముందస్తుగా వచ్చాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ ప్రణాళికలలో మార్పులు చేసుకోవాలి. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియాను అందుబాటులో ఉంచాలి. విత్తనాల, ఎరువులు అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలి.

**90 శాతం రైతులు సంతోషంగా..**

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో గతంలో ఎన్నడూ లేని విధంగా మంచి ఫలితాలను సాధిస్తోంది. రైతులకు 48 గంటల్లో చెల్లింపులు పూర్తి చేస్తున్నాం. గతంలో కంటే ఈ సీజన్‌లో దాదాపు 22 లక్షల టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలుచేసిన పౌరసరఫరాల సంస్థను అభినందిస్తున్నా. 90 శాతానికిపైగా రైతులు ధాన్యాన్ని విక్రయించి సంతోషంగా ఉన్నారు. తెలంగాణకు రుతుపవనాలు ముందుగా రావడంతో కల్లాల వద్ద ధాన్యం తడిసిపోయి కొంతమంది రైతులు ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. 10 లక్షల 50 వేల మంది రైతుల వద్ద నుంచి 64 లక్షల టన్నులకుపైగా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశాం. ప్రభుత్వం చేసిన మంచి పనిని చెప్పుకోవాల్సిన అవసరం ఉంది.

**ప్రజల్ని భూతంలా పీడించిన ధరణి**

భూ భారతి చట్టం అమలుకు ముందస్తుగా నాలుగు మండలాలను ఎంపిక చేసుకున్నాం. అనంతరం ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. జూన్ 3 నుంచి 20 వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో నిర్వహించాలి. వీటిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతోపాటు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ ప్రజలను భూతంలా పీడించింది. భూ భారతి చట్టం పేదలకు చుట్టంలా పని చేస్తుంది.

*** యువ వికాసంతో ఇటుక, సెంట్రింగ్ యూనిట్లు**

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలును కలెక్టర్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలి. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలను నియమించాలి. మేస్త్రీ చార్జీలు, నిర్మాణ పరికరాల ధరలు నియంత్రణలో ఉండాలి. అడ్డగోలు ధరలతో పేదలను మోసం చేయకుండా జాగ్రత్త వహించాలి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ జారీ చేసి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా జాగ్రత్త వహించాలి. మహిళా సంఘాలు, యువత ద్వారా 'రాజీవ్ యువవికాసం' కింద ఇటుక, సెంట్రింగ్ యూనిట్ల తయారీ కేంద్రాల ఏర్పాటు చేయించాలి. తక్కువ ధరతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణానికి అనేక కొత్త సాంకేతిక పద్ధతులు వచ్చాయి. వీటిని లబ్ధిదారులకు తెలపాలి. కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రులు మే 29, 30 తేదీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వానాకాలం సాగు ఏర్పాట్లు, ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతిపై రిపోర్టు తయారు చేసి జూన్ 1 నాటికి సమర్పించాలి. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాలను జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి" అని సీఎం ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రస్తుత కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని సూచించారు.

*** పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలి: మంత్రి ఉత్తమ్**

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉందని.. పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలిపారు. 'రవాణా సమస్యలు రాకుండా రవాణా, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వాహనాలు అందుబాటులో పెట్టాలి. మిల్లర్లు సహకరించకపోతే ఇంటర్మీడియట్ (తాత్కాలిక) గోదాములకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి' అని ఉత్తమ్ అన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కింద మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో 15 శాతం మాత్రమే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, మిగతావాటి పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలన్నారు.

*** వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: సీఎం**

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చేసిన సూచనలకు అనుగుణంగా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగా వచ్చిన వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు వచ్చే ప్రమాదముంటుందని.. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఏజెన్సీ, అటవీ ప్రాంతాలున్న జిల్లాల కలెక్టర్లు ప్రజారోగ్యంపై మరింత దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు నమోదవుతున్నాయని, అన్ని జిల్లాల్లోనూ సీజన్‌కు అనుగుణంగా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

## వాయుసేనకు నూతన శక్తి!

దిల్లీ: అత్యంత అధునాతన ఐదోతరం స్టెల్త్ యుద్ధవిమానాన్ని సాకారం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్' (ఆమ్కా) ప్రాజెక్టు అమలు కోసం 'ఎగ్జిక్యూషన్ నమూనా'కు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. రక్షణ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశీయ పరిజ్ఞానంతో ఆమ్కా ప్రాజెక్టుపై భారత్ కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. దీనికింద మధ్యస్థ బరువు కలిగిన అధునాతన స్టెల్త్ యుద్ధవిమానాన్ని అభివృద్ధిచేస్తోంది. ఇది శత్రువుల రాడార్లను ఏమార్చి, వారి గగనతలంలోకి లోతుగా చొచ్చుకెళుతుంది. దీనిద్వారా భారత వైమానిక పోరాట సామర్థ్యం మరింత మెరుగుపడుతుంది. పరిశ్రమల భాగస్వామ్యంతో బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) దీన్ని అమలు చేస్తుంది. ఎగ్జిక్యూషన్ నమూనా కింద.. ప్రైవేటు, ప్రభుత్వరంగ సంస్థలకు పోటీ ప్రాతిపదికన సమానావకాశాలు దక్కుతాయి. బిడ్‌లు స్వతంత్రంగా, సంయుక్తంగా, కన్సార్షియం ద్వారా దాఖలు చేయవచ్చు. ఆ సంస్థ భారత్‌కు చెందినదై ఉండాలి. ఆమ్కా నమూనాను ఇటీవల బెంగళూరులో 'ఏరో ఇండియా'లో తొలిసారి ప్రదర్శించారు.

**ప్రతికూల పరిస్థితుల్లోనూ సత్తా చాటేలా..**

* కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఎలక్ట్రానిక్ పైలట్, నెట్ ఆధారిత ఆయుధ వ్యవస్థలు వంటి ప్రత్యేకతలు ఆమ్కా సొంతం. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఇది సమర్థంగా సత్తా చాటుతుంది.
* 25 టన్నుల బరువుతో తయారుకానున్న దీనిలో కృత్రిమమేధతో నడిపే ఎలక్ట్రానిక్ పైలట్, ఆయుధ వ్యవస్థలు ఉంటాయి. ఇందులో అధునాతన ఏవియానిక్స్, సెన్సర్ ఫ్యూజన్ ఉంటుంది. శత్రు రాడార్లకు దొరక్కుండా దీని అస్త్రశస్త్రాలను అంతర్గతంగా ఉంచడానికి ప్రత్యేక అరలు ఉంటాయి.
* ఆమ్కా బహుళ రీతుల్లో పోరాటం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. భారత వైమానిక దళంతోపాటు నౌకాదళానికీ సేవలు అందించేలా దీన్ని రూపొందిస్తున్నారు. శత్రు గగనతలంపై ఆధిపత్యం సాధించడం, భూతలంపై దాడులు, శత్రువుల గగనతల రక్షణ వ్యవస్థల ధ్వంసం, ఎలక్ట్రానిక్ యుద్ధం వంటి అనేక అవసరాలకు ఇది ఉపయోగపడుతుంది.
* ఈ ఫైటర్ జెట్.. తేలికపాటి పోరాట విమానాలు తేజస్ కలిసి వాయుసేనను బలోపేతం చేయనున్నాయి.
* ఈ లోహ విహంగాన్ని పైలట్ సహితంగా, పైలట్ రహితంగా పనిచేసేలా డిజైన్ చేస్తున్నారు.
* హైదరాబాద్‌కు చెందిన వెమ్ టెక్నాలజీస్ సంస్థ దీని ఆకృతిని తయారుచేసింది.
* ఈ ప్రాజెక్టు ప్రారంభ అభివృద్ధి వ్యయం దాదాపు రూ.15 వేల కోట్లుగా అంచనా వేశారు. బహుళ సేవలు అందించే 114 యుద్ధవిమానాలను కూడా 1,800 కోట్ల డాలర్ల వ్యయంతో వాయుసేన సమకూర్చుకోబోతోంది. ఇటీవలి ఏళ్లలో సైనికపరంగా ఇదొక భారీ కార్యక్రమం.
* ఆమ్కా యుద్ధవిమానాలను 2034 నాటికి వైమానిక దళంలోకి చేర్చాలన్నది లక్ష్యం.
* ప్రస్తుతం ఐదో తరానికి చెందిన స్టెల్త్ యుద్ధవిమానాలు ఎఫ్22, ఎఫ్35 (అమెరికా), జె20, జె35 (చైనా) మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఎస్‌యూ 57 పేరుతో రష్యా కూడా ఈ తరహా ఫైటర్‌జెట్‌ను రూపొందించింది. వీటికి పోటీగా ఆమ్కా నిలవనుంది.
* ఆమ్కా తయారీ ప్రక్రియకు హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) నేతృత్వం వహిస్తుంది. రక్షణ శాఖ ఆమోదించిన నమూనా ప్రకారం.. గణనీయ స్థాయిలో ప్రైవేటు భాగస్వామ్యానికి వీలుంటుంది. తద్వారా ఉత్పత్తి ప్రక్రియ వేగవంతమవుతుందని నిపుణులు చెబుతున్నారు.
* తొలివిడతగా ఉత్పత్తి చేసే మార్క్ 1 శ్రేణి ఆమ్కా జెట్‌లలో అమెరికాకు చెందిన జీఈ414 ఇంజిన్లు ఉపయోగిస్తారు. మార్క్ 2లో మాత్రం దేశీయంగా అభివృద్ధి చేసే మరింత శక్తిమంతమైన ఇంజిన్లను ఉపయోగించే అవకాశం ఉంది. విదేశీ భాగస్వామ్యంతో ఈ ఇంజిన్లను రూపొందించాలని భారత్ తలపోస్తోంది.

## అందాల పోటీల ఫైనల్‌కి కౌంట్‌డౌన్

(మొదటి పేజీ తరువాయి)

ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో క్వార్టర్స్‌కు చేరారు. మిగతా 26 మందిని అమెరికా కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియాఓషియానా ఖండాల వారీగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండోనేసియా, వేల్స్ భామలు రెండు పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఆ ప్రకారం టాప్ 40లో ఇప్పటివరకు 12 బెర్త్‌లు మాత్రమే ఖరారయ్యాయి. అంటే ఇంకా 28 మందిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. టాప్ 40లో కూడా ఒక్కో ఖండం నుంచి పది మంది ఉండేలా ఎంపిక చేస్తారు. ఆ తర్వాతి రౌండ్‌లో వీరిలోంచి టాప్ 20ని తీసుకుంటారు. ఒక్కొక్క ఖండం నుంచి ఐదుగురు ఉంటారు. ఇక అంతిమ ఘట్టానికి ముందు టాప్ 8 అంటే ఒక్కో ఖండం నుంచి ఇద్దర్ని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత ఒక్కో ఖండం నుంచి ఒక్కొక్కరే అంటే నలుగురు అంతిమంగా కిరీటం కోసం మిగులుతారు. వీరిలో ఒకరు విజేతగా, మిగిలిన ముగ్గురు ఒకటి, రెండు, మూడో రన్నరప్‌గా నిలుస్తారు.

**3,500 మంది అతిథులు వస్తారని అంచనా..**

హైదరాబాద్ హైటెక్స్‌లో కొత్తగా నిర్మించిన నాలుగో హాల్‌లో 31న జరిగే ఫైనల్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సైబర్ పోలీసులు, ట్రాఫిక్ విభాగం, పర్యాటక శాఖ, నిర్వాహకులు ఈ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. హాల్ సామర్థ్యం 3,500 మంది కావడంతో అంతమంది అతిథులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఫైనల్ వేడుకలు సాయంత్రం నుంచే మొదలవుతాయి. తుది పోటీలు రాత్రి 10 నుంచి అర్ధరాత్రి వరకు జరగనున్నాయి.

## పద్మాలు అందుకున్న ప్రముఖులు

దిల్లీ: వివిధ రంగాల్లో చేసిన విశేష సేవలకుగాను కేంద్రం ఈ ఏడాది ప్రకటించిన పద్మపురస్కారాలను పలువురు ప్రముఖులు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీష్ సింగ్ కేహర్, కతక్ నృత్యకారిణి కుముదిని లఖియా తరపున మనుమడు సహాన్ హత్తంగడి, సంగీతకారిణి శారదా సిన్హా తరపున కుమారుడు అన్షుమన్‌సిన్హా (ఇద్దరికీ మరణానంతరం)లు పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ బహుభాషా నటి శోభనా చంద్రకుమార్, పట్టువస్త్రాల వ్యాపార దిగ్గజం నల్లి కుప్పుస్వామిచెట్టి, ఆర్థికవేత్త బిబేక్ డెబ్రాయ్ తరపున సతీమణి సుపర్ణ బెనర్జీ (మరణానంతరం), ప్రముఖ ఆర్కియాలజిస్ట్ కైలాస్‌నాథ్ దీక్షిత్, సాహిత్య అకాడమీ వ్యవస్థాపకులు జతిన్‌గోస్వామి, మాజీ లోక్‌సభ స్పీకర్ మనోహర్‌జోషీ తరపున కుమారుడు ఉన్మేష్ జోషీ (మరణానంతరం), ప్రముఖ నటులు అనంతనాగ్, ప్రముఖ పాత్రికేయులు రాంబహదూర్‌రాయ్, దీదీమాగా పేరొందిన ఆధ్యాత్మిక వేత్త సాధ్వీ రితంభరలు పద్మభూషణ్ స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సాహిత్యం, విద్యారంగాల నుంచి కేఎల్ కృష్ణ, వాచస్పతి వాదిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి, తెలంగాణ నుంచి ప్రజావ్యవహారాల విభాగంలో మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డులు స్వీకరించారు.



## మళ్లీ ఏపీ హైకోర్టుకు జస్టిస్ బట్టు దేవానంద్

(మొదటి పేజీ తరువాయి)

స్వస్థలం గుడివాడ. ఆంధ్రా యూనివర్సిటీ లా కాలేజీ నుంచి బీఎల్ డిగ్రీ పొందారు. 1989 జులై 6న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. విశాఖపట్నం జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లింగంపల్లిలో 1967 నవంబరు 7న అభిషేక్‌రెడ్డి జన్మించారు. ఉస్మానియా లా కాలేజీలో న్యాయశాస్త్రంలో పట్టా పొంది, 1990లో బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ కేసుల్లో నైపుణ్యం సాధించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, జేఎన్‌టీయూ స్టాండింగ్ కౌన్సిల్‌గా, హెచ్ఎండీఏ, ఇంటర్ బోర్డు, బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తరఫున కేసులు వాదించారు. 2019 ఆగస్టు 26న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 మే 15న పట్నా హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తిరిగి రెండేళ్లకు మళ్లీ తెలంగాణ హైకోర్టుకే బదిలీపై వస్తున్నారు. బాపట్ల జిల్లా జమ్ములపాలెంలో లలిత జన్మించారు. న్యాయశాస్త్రంలో పట్టా పొంది 1994లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగం, ట్యాక్స్, సర్వీసు, నాన్‌సర్వీసు తదితర రంగాల్లో నైపుణ్యం సాధించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఇఫ్లూ, తితిదే, దేవాదాయ, శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, స్విమ్స్, తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయాలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2020 మే 2న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 నవంబరు 15న తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2023 జులై 28న కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళ్లారు. తిరిగి తెలంగాణ హైకోర్టుకు బదిలీపై వస్తున్నారు. నెల్లూరులో 1972 ఫిబ్రవరి 5న సుమలత జన్మించారు. 1995లో తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. జిల్లా జడ్జిగా 2007లో ఎంపికై కర్నూలు, మదనపల్లె, అనంతపురం, గుంటూరులలో పనిచేశారు. జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా, సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా విధులు నిర్వర్తించారు. 2021 అక్టోబరు 14న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2023 నవంబరు 23న కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం సిఫారసు చేసింది.

## ఏపీ దశ, దిశ మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

దేవుని కడపలో నిర్వహిస్తున్న తెదేపా మహానాడు చరిత్ర సృష్టించబోతోందని.. ఆంధ్రప్రదేశ్ దశ, దిశ నిర్దేశించబోతోందని ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. ఈ మహానాడులో అనేక విషయాలు చర్చించి భావితరాల భవిష్యత్తుకు అవసరమైన విధానాలు రూపొందిస్తామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చాక 78 ఏళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో.. రాబోయే 22 ఏళ్లలో అంతకు రెట్టింపు అభివృద్ధి జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కడపలో తెదేపా మహానాడుకు చంద్రబాబు మంగళవారం జ్యోతి వెలిగించి శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వైకాపా హయాంలోని విధ్వంస పాలకుల కుంభకోణాల లెక్కలు తీస్తున్నామని.. విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు. ఎన్నికల్లో అవినీతి పాలకుల్ని ఓడించి, కూటమిని గెలిపించిన ప్రజలు.. అక్రమార్కులను శిక్షించే బాధ్యత మనకు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజాసంపద దోచుకున్నవారిని, గాడి తప్పిన నాయకుల్ని.. అధికారుల్ని ఉపేక్షించే సమస్య లేదని స్పష్టం చేశారు. ఆలస్యం కావచ్చేమో గానీ, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని తేల్చిచెప్పారు. 'వైకాపా ప్రభుత్వం చేసిన అవినీతికి అంతే లేదు. ఎవరు అవినీతి చేసినా కక్కించే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటుంది. నేరస్థులు ఎక్కడున్నా వదిలిపెట్టే సమస్య లేదు. నేరస్థులకు ఆంధ్రప్రదేశ్‌లో చోటు లేదని నిరూపిస్తాం' అని ప్రకటించారు. కార్యకర్తల వల్లే ఇక్కడున్నామని మర్చిపోవద్దు '2024 ఎన్నికల్లో ప్రజలు మనకు అపూర్వ విజయం కట్టబెట్టారు. పసుపు సైనికులు, పార్టీ నాయకత్వమే దీనికి కారణం. జనసేన, భాజపాలతో కలిసి కూటమి ఏర్పాటు చేయడం మహా విజయానికి దోహదపడింది. మీ పోరాటం, త్యాగాల ఫలితమే నేటి అధికారం. ఏమీ ఆశించకుండా దశాబ్దాలుగా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే ఇక్కడున్నామనే విషయాన్ని మంత్రులు, నాయకులంతా గుర్తుంచుకోవాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు. తెదేపా పని అయిపోయిందని గతంలో అన్నవారి పనే అయిపోయిందని.. తెదేపా జెండా ఎప్పుడూ రెపరెపలాడుతూనే ఉందని అధినేత వ్యాఖ్యానించారు. చిట్టచివరి కార్యకర్త కూడా ప్రభుత్వంలో భాగస్వామి కావాలని, వారి ద్వారా పాలన జరిగినప్పుడే నిజమైన పొలిటికల్ గవర్నెన్స్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

## ఈసారి వర్షాలు పుష్కలం!.. ఐఎండీ అంచనా

(మొదటి పేజీ తరువాయి)

జూన్ నెలలో సాధారణం కంటే ఎక్కువ వానలు కురిసి, గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వెల్లడించింది. దీర్ఘకాలిక సగటు (166.9 మి.మీ.)తో పోలిస్తే 108% వర్షాలు కురుస్తాయని తెలిపింది. జూన్ నుంచి సెప్టెంబరు మధ్య సగటు (87 మి.మీ.) కంటే 106% వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, చుట్టుపక్కల ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా; వాయవ్య భారతదేశంలో సాధారణంగా, ఈశాన్య రాష్ట్రాల్లో తక్కువగా వర్షాలు పడతాయని తెలిపింది. మధ్య, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాల్లో కూడా సాధారణ సగటుకు మించిన వానలు పడతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. మరోవైపు పసిఫిక్ ప్రాంతంలో ఎల్‌నినో తటస్థంగా ఉంది. ఈసారి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం చూపబోదని ఐఎండీ తెలిపింది.

**తేరుకున్న ముంబయి.. కేరళ ఉక్కిరిబిక్కిరి**

రుతుపవనాలు వచ్చీ రావడంతోనే కుండపోత వానలు పడిన ముంబయిలో 24 గంటల వ్యవధిలో 106 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. సోమవారంతో పోలిస్తే మంగళవారం పరిస్థితి కొంత మెరుగుపడింది. సబర్బన్ రైళ్లు, బస్సులు ఆలస్యంగానైనా నడుస్తున్నాయి. దక్షిణ ముంబయిలోని పలు ప్రాంతాలు ఇంకా వరదనీటిలోనే ఉన్నాయి. కేరళలో భారీ వానలు మంగళవారం కూడా సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేశాయి. వృక్షాలు కూలిపోయి రైలుపట్టాలపై పడటంతో అనేక రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. నీటమునిగిన ప్రాంతాల నుంచి ప్రజల్ని పడవల్లో తరలిస్తున్నారు. తిరువనంతపురం సమీపంలోని కల్లార్ వద్ద భారీ కొండచరియలు విరిగిపడటంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం తప్పలేదు. మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలో వరద ఉధృతికి కొట్టుకుపోవడం వల్ల నలుగురు, విద్యుదాఘాతం వల్ల ఒకరు చనిపోయారు.

## ఉగ్రవాదమే పాకిస్థాన్ యుద్ధనీతి

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబం అన్న భావన మన సంస్కారం..మన పొరుగువారి సంతోషాన్నీ మనం కోరుకుంటాం. మన బలాన్ని సవాలు చేస్తే..మనదేశం వీరుల గడ్డ అని కూడా చూపిస్తాం" అని మోదీ తెలిపారు. గుజరాత్ పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం గాంధీనగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్ సమస్య పరిష్కారానికి సహకరిస్తా

*** మంత్రి శ్రీధర్ బాబు**

(హైదరాబాద్, ప్రజస్ఫూర్తి ) : .ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు తోడ్పాటు అందిస్తానని ఐటీ శాఖ మంత్రి, మేడ్చల్ జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ సమస్య పరిష్కారానికి సహకారం అందిస్తామని తెలిపారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు, జర్నలిస్టుల ఇండ్ల పట్టాల సమస్యల పరిష్కరించాలని కోరుతూ టి యు డబ్ల్యూ జే



మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి శ్రీధర్ బాబును మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కలిశారు . ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుతో పాటు , ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జర్నలిస్టుల ఇళ్ల పట్టాలు, ఇతర అంశాలపై చర్చించారు . ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు జర్నలిస్టులకు అండగా ఉంటూ జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైనది అన్నారు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచే జర్నలిస్టుల కు తగిన సహకారం ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్రామిరెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు మహేందర్ రెడ్డి, కూకట్ పల్లి అధ్యక్షులు ఎంఏ కరీం, సీనియర్ జర్నలిస్ట్ లు తిరుపతి రెడ్డి, నరోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐ సుధాకర్ చారికి ఎస్ఐగా పదోన్నతి



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 27: జిన్నారం పోలీస్ స్టేషన్లో గత మూడున్నర సంవత్సరాలుగా బాధ్యతల నిర్వహణ చేస్తున్న సుధాకర్ వారికి ఎస్ఐగా ప్రమోషన్ లభించింది.1990లో కానిస్టేబుల్ గా నియామకమయిన సుధాకర్ ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ లలో విధులను నిర్వర్తించారు. విధుల్లో ఎలాంటి రీమార్క్ లేకుండా పదోన్నతి పొందారు. ఎస్పీ పరితోష్ పంకజ్ స్టార్ గుర్తులను తొడిగి అభినందించారు. ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు ప్రస్తుతం ఐజి కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. సుధాకర్ చారిని సీఐ నయీముద్దీన్ఎస్సై నాగలక్ష్మి, మండల ప్రముఖులు, పోలీస్ సిబ్బంది అభినందించారు.

## రోడ్డు పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

*** రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి): రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా గాంధీనగర్ , సంజయ్ గాంధీనగర్ మెయిన్ రోడ్డు (ఆస్బెస్టాస్ కమాన్ నుండి సంజయ్ గాంధీనగర్) లో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు పనులను మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ , జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసు శాఖ వారితో కలిసి కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సంజయ్ గాంధీ నగర్ మెయిన్ రోడ్డు వేసే సమయంలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ ను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించాలని ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్, డిఈ సాగర్, ఏఈ స్వాతి, వర్క్ ఇన్స్పెక్టర్ కిషోర్, సంజయ్ గాంధీనగర్ , నెహ్రూ నగర్ సంక్షేమ సంఘం సభ్యులు , మాజీ అధ్యక్షులు, డివిజన్ నాయకులు, స్థానిక బస్తీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప"యోగా"లు లెన్నో

*** జిల్లా లో యోగా కార్యక్రమాలు**

*** డీపీఎం డాక్టర్ మహేష్ గౌడ్**



ప్రజా స్ఫూర్తి భద్రాద్రి కొత్త గూడెం: జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకల సందర్భంగా యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ అనే నినాదంతో హరిత యోగా, యోగా వాక్, యోగా సంగమం, యోగా ప్రభావ అనే నాలుగు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయుష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ (డీపీఎం) డాక్టర్ మహేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న మంగళవారం ప్రారంభమయ్యాయి. జూన్ 21 వరకు గ్రామ, మండల స్థాయిలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల వైద్యాధికారుల పర్యవేక్షణలో యోగా శిక్షకుల చేత ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. యోగా కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువతీయువకులు, విద్యార్థులు భాగ స్వామ్యం కావాలని ఆయన కోరారు. దేశ వారసత్వాన్ని, సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసే కృషిలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు..



## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టాల్సిందే

**- బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నం**

**- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టాల్సిందేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ తల్లి చిత్ర పటాలను ఏర్పాటు చేసేందుకు తీసుకొని వెళ్తుంటే సిరిసిల్ల పట్టణానికి చెందిన బిఆర్ఎస్ నేత సెస్‌కు సుమారు 6 లక్షల రూపాయల వరకు బిల్లు చెల్లించకుండా యెగబెట్టిన జిందం చక్రపాణి తమల్ని చంపే ప్రయత్నం చేస్తూ తమ మీదకి తన కారుని తీసుకొస్తే తమ కార్యకర్తలు తిరగబడ్డారని, ఇదంతా అక్కడి ప్రజలు గమనించారని అన్నారు. పోలీసులు శాంతిభద్రతలను కాపాడాలని ఉద్దేశంతో బిఆర్ఎస్ నాయకులు మమ్మల్ని కొట్టే, చంపే ప్రయత్నం చేస్తేనే వారిపై లాఠీచార్జ్ చేశారని, ఆ సందర్భంలో తమపై కూడా పోలీసులు లాఠీఛార్జ్ చేయడం జరిగిందని, ఈ లాఠీఛార్జ్‌లో తంగళపల్లికి చెందిన ఇద్దరు కార్యకర్తలకు కూడా గాయాలయ్యాయి అన్నారు. అయితే కావాలనే బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు కేటీఆర్ ఓడిపోతాడు అని ఇంటలిజెన్స్ రిపోర్ట్ ఇవ్వడంతోనే భయపడి వారానికి రెండు రోజులు నియోజకవర్గంలో ఉంటాను, ఏ సమస్యలున్నా వింటాను అని మాయ మాటలు చెప్పి గెలిచిన ఎమ్మెల్యే ఇప్పటికి ఎన్నిసార్లు నియోజకవర్గానికి వచ్చారని, ఎంతమంది సమస్యలు తీర్చారో చెప్పాలని ప్రశ్నించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గత 20 సంవత్సరాలుగా ప్రతిపక్షంలో ఉన్నా కూడా ప్రజల మధ్య ఉంటూ ప్రతి ఒక్కరి సమస్య తన సమస్యగా భావించి తనకున్న పరిధిలో ప్రతి ఒక్కరి సమస్య తీర్చిన నాయకుడు కేకే మహేందర్ రెడ్డి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జోలికి గానీ, కార్యకర్తల జోలికి గాని వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి నర్సింహులు, కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలున్నారు.



## అధికారం కోల్పోయిన తర్వాత గుర్తుకు రావడం సిగ్గుచేటు

**: కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ గౌడ్**

రాజాపేట, ప్రజా స్ఫూర్తి :తాగునీటి జలాల విషయంలో అధికారంలో 10 సంవత్సరాల కాలం పాటు ఉన్న టిఆర్ఎస్ గద్దె దిగిన తర్వాత గుర్తుకు రావడం సిగ్గుచేటని రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ విమర్శించారు. రాజపేట మండల కేంద్రంలో రాజపేట మండలం అభివృద్ధి కొరకు గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పార్టీలో ఉండి సాగు జలాలు రైతులను పట్టించుకోని వాళ్లు ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత అన్ని గుర్తుకొస్తున్నాయన్నారు. ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య సాగునీరు పైన అభివృద్ధి విషయంలో ప్రతిరోజు ప్రజలతో మమేకమై అనేక సంక్షేమ పథకాలు రాజపేట మండలానికి, నియోజకవర్గానికి అందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వరి ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసారని, సన్న వడ్లకు బోనస్ కాంట వద్ద తరుగు లేకుండా రైతుల అకౌంట్లో ఇప్పటికే డబ్బులు జమ చేయడమైందన్నారు. రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ యువ శక్తి పథకాలు పెన్షన్స్ త్వరలోనే అమలు అవుతున్నాయని, అధికారులు పంపిణీకి సిద్ధం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు అన్ని చూసి ఓర్వలేదన్నారు. ఎమ్మెల్యే పై స్థాయి మరచి విమర్శలు చేయడం మానుకోవాలని, రాబోయే రోజుల్లో ప్రజా పాలన లో అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందుతాయని ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజపేట నాయకులు ఆడెపు లక్ష్మీనారాయణ, ఆడెపు శ్రీశైలం, సీనియర్ నాయకులు కేదార్ గౌడ్, టౌన్ అధ్యక్షుడు ఐరేణి నవీన్ కుమార్ రేగు సిద్ధులు పుల్లంగారు పోచయ్య యూత్ అధ్యక్షుడు పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## సోనియా గాంధీ నగర్ పేస్ 3 లో వరద నీటి సమస్యను పరిశీలించిన కార్పొరేటర్

ప్రజాస్ఫూర్తి, కాప్రా : సోనియా గాంధీ నగర్ పేస్ 3 లో వరద నీటి సమస్యను కార్పొరేటర్ వాటర్ వర్క్స్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళ వారం పరిశీలించారు. సోనియా గాంధీ ఫేస్ 3 కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దగ్గరుండి పరిశీలించారు. సాధ్యమైనంత తొందరలో సమస్యను పరిష్కరిస్తానని వరద నీరు వర్షం వచ్చినప్పుడు నాలుగు దిక్కుల నుంచి వస్తుందని నీరు పోవడానికి అత్యధిక సమయం పడుతుందని ఇంటి ముందర దుర్గంధం పాలవుతుందని రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని తెలియజేయడంతో కార్పొరేటర్ పర్యటించి మాట్లాడుతూ నీళ్లు సాఫీగా పోవడానికి లెవలింగ్ మొత్తం చెక్ చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోనియాగాంధీ కాలనీ పెద్దలు కాలనీవాసులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహిళా నాయకురాలు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## యాదగిరిగుట్ట పట్టణ నూతన సీఐ భాస్కర్ కలిసిన సంఘం బాధ్యులు





యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్ట పట్టణ సిఐగా ఇటీవల బాధితులు స్వీకరించిన సీఐ భాస్కర్ ని తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అసోసియేషన్ వర్కర్స్ యూనియన్ జాయింట్ సెక్రెటరి సూరంపల్లి బాబురావు ఆధ్వర్యంలో మంగళవారం సీఐ భాస్కర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకే శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి తాపీ కార్మిక సంఘం సలహాదారులు నాగపురి శ్రీను మరియు ప్రధాన కార్యదర్శిపబ్బాల రాజు, భూపాల్ రెడ్డి,సూరంపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర తాజా మాజీ సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి అరెస్ట్




రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాష్ట్ర తాజా మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డిని మంగళవారం ఉదయం రాజపేట పోలీసులు అరెస్టు చేశారు. సర్పంచుల పెండింగ్ బిల్లుల మంజూరి కోసం ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రి ప్రజావేదిక లో పాల్గొనేందుకు వెళ్లేందుకు ప్రయత్నం చేయగా పోలీసులు అరెస్టు చేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు వెయ్యి మంది సర్పంచులను అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. పెండింగ్ బిల్లులు 1503 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు ప్రభుత్వం చెప్పిన విషయం అబద్ధమని మధుసూదన్ రెడ్డి చెప్పారు. మధుసూదన్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, జిల్లా మాజీ ప్రజా ప్రతినిధుల పోరం అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, జలసాధన సమితి మండల కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్, నరసాపురం మాజీ సర్పంచి నాగిర్తి గోపి, భాస్కర్, సిపిఐ మండల శాఖ కార్యదర్శి చిగుళ్ల లింగం తదితరులు మద్దతు పలికారు.

## మంత్రులను కలసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో కలసి ఆధ్యాత్మిక పర్యటన ముగించుకున్న అనంతరం మంగళవారం రోజు హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని..మంత్రులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి ని, దామోదర రాజనర్సింహ ని, తుమ్మల నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలసి తిరుపతి,అరుణాచలం ఆలయాల ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలేరు నియోజకవర్గం లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు , పలు సమస్యలను చర్చించారు.

# ఇసుక ర్యాంపుల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలి. మైనింగ్ శాఖ ఎండి భవేష్ మిశ్రా



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో పీసా యాక్ట్ ప్రకారం మహిళా సమాఖ్య ల ద్వారా ఇసుక ర్యాంపుల ఏర్పాటు, నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని మైనింగ్ శాఖ ఎండి భవిష్య మిశ్రా అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరంలో గిరిజన సమైక్యల ద్వారా ఇసుక ర్యాపుల ఏర్పాటు , నిర్వహణ కు తీసుకోవలసిన చర్యల పై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఐ టిడిఏ పి. ఓ రాహుల్ ,ములుగు ఐటీడీఏ పీవో చిత్ర మిశ్ర తో కలిసి టిజీ ఎం డి సి, ఐ టి డి ఏ , మైనింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లాలో ఉన్నటువంటి ఇసుక ర్యాంపుల వివరాలు , ప్రస్తుతం ఇసుక రాంపుల నిర్వహణలో చేపడుతున్న పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మైనింగ్ శాఖ ఎండికి వివరించారు. అనంతరం మైనింగ్ శాఖ ఎండి భవేష్ మిశ్రా మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన సొసైటీల ద్వారా ఇసుక ర్యాంపుల నిర్వహణ చేపట్టడం ద్వారా గిరిజన కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వారి జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. గిరిజన మహిళా సంఘాల ద్వారా ఇసుక ర్యాంపుల నిర్వహణ కు ఐటిడిఎ ద్వారా అవసరమైన వాహనాలు మరియు యంత్ర పరికరాలు సమకూర్చడం జరుగుతుందన్నారు. దీని ద్వారా గిరిజన మహిళా సమాఖ్యలకు మూడు రెట్ల అధిక ఆదాయం సమకూర్తుందన్నారు. ఇసుక ర్యాంపుల నిర్వహణకు ఏజెన్సీ ప్రాంతమైన గిరిజనులకు ఐటీడీఏ మరియు మైనింగ్ శాఖ అధికారులు సరైన అవగాహన కల్పించాలన్నారు. ఏర్పాటు చేసే ప్రతి ఇసుక రాంపులలో మహిళా సమాఖ్యలకు తోడ్పాటున అందించే విధంగా ఐటిడిఏ నుండి ఒక అధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 8, ములుగు జిల్లాలో మూడు ఇసుక ర్యాంపులు ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు వారాల్లో ఇసుక ర్యాంపులకు ఏర్పాటుకు ఉత్సాహవంతులైన మహిళా సమాఖ్య సభ్యులను గుర్తించాలన్నారు. ముందుగా ప్రయోగాత్మకంగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఒక ఇసుక ర్యాంపును ప్రారంభించే విధంగా వారికి శిక్షణ అందించాలని సూచించారు. గిరిజన మహిళలు సమర్థవంతంగా ఇసుక ర్యాంపుల నిర్వహణ చేయడానికి అన్ని విధాల ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, స్పెషల్ ఆఫీసర్ అశోక్ కుమార్, తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శంకర్ నాయక్, ఏడి మైన్స్ దినేష్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముక్కర్ల కొమురయ్య హంసమ్మ పెళ్లిరోజు వేడుకలు



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి తాపీ కార్మిక సంఘం మాజీ అధ్యక్షులు ముక్కర్ల కొమురయ్య హంసమ్మ పెళ్లిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది లక్ష్మీ నరసింహ స్వామి తాపీ కార్మిక సంఘం తరపున అధ్యక్షులు పబ్బాల శ్రీరాములు ఉపాధ్యక్షులు దొమ్మాట సంజీవ ప్రధాన కార్యదర్శి పబ్బాల రాజు, సలహాదారులు నాగపురి శ్రీను, కంబాల జాంగిర్, బూడిద స్వామి కలిసి ఈ పెళ్లి రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## బీరప్ప జాతరలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్

*** రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండలం**



చల్లూరు గ్రామంలో జరుగుతున్న బీరప్పస్వామి, కామావతిదేవి,చౌడలమ్మ దేవతల పండుగకు మంగళవారం భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి. అశోక్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై దేవతలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కానుగంటి. శ్రీనివాస్ రెడ్డి,కాదూరి. అచ్చయ్య,మాజీ మండల అధ్యక్షులు, తాజా మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, సీనియర్ నాయకుడు చల్లూరు తాజా మాజీ ఉపసర్పంచ్ బింగి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు, ఉచ్చేంతల రాజు,గంగు జలంధర్ రెడ్డి నాయకులు పోతరాజు శేఖర్,షోషల్ మీడియా మండల కన్వీనర్ కొల్లూరి రమేష్,,సార్ల రాధకృష్ణ గుజ్జుక సందీప్ తదితరులు పాల్గొన్నారు. కుల పెద్దలు మీస బాలయ్య, మీస కృష్ణ లు సన్మానించారు.

## వైద్య ఖర్చులకై 2లక్షల రూపాయల చెక్ అందజేత



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన బొల్లె శ్రీనివాస్ అనారోగ్యంతో బాధ పడుతుండగా ఆయన భార్య కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డికి విన్నవించింది. వారి పరిస్థితిపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ దృష్టికి తీసుకుపోయారు. దీంతో వైద్య ఖర్చులకు 2లక్షల రూపాయల చెక్‌ను మంగళవారం అందజేశారు. వైద్య ఖర్చులకు చెక్ అందజేసిన కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝుకు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డికి ఈ సందర్భంగా శ్రీనివాస్ భార్య కృతజ్ఞతలు తెలిపింది.





## ఈ సి ఐ ఎల్ ఎక్స్ రోడ్ లో అమావాస్య అన్న ప్రసాద వితరణ

ప్రజాస్ఫూర్తి, కాప్రా: ఈ సి ఐ ఎల్ ఎక్స్ రోడ్ లో వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా పలబట్ల ఆనంద్ బాబు చైర్మన్ విశిష్ట జువెలర్స్ & డైమండ్స్ జూబ్లీహిల్స్, కొత్తపేట విచ్చేసినారు. అనంతరం కుషాయిగూడ కు చెందిన పేద వృద్ధురాలు మాలే వరమ్మ కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి మరియు పడకంటి కమలమ్మలకు ఈనెల పించిని నలుగురికి వెయ్యి రూపాయలు చొప్పున నలుగురికి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని, తిరుమలేష్ గుప్తా, కార్యనిర్వాన కార్యదర్శి గంప కృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులు నంగునూర్ అశోక్ గుప్తా, చెన్న చక్రపాణి గుప్త , నాగేశ్వరరావు గుప్తా, తాటి శ్రీనివాస్ గుప్తా ,కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్తా, చందా సంతోష్ గుప్తా, అమర కృష్ణ గుప్తా, బల్లి శ్రీధర్ గుప్త ,కార్యవర్గ సభ్యులు ఉప్పల ఆంజనేయులు గుప్తా, సభ్యులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, అర్థం శ్రీనివాస్ గుప్త ,కండె శివ గుప్త , దిడిగం కైలాసం గుప్త , బుస్స శ్రీనివాస్ గుప్తా ,గజ్జల రమేష్ గుప్తా , బెలిదే బాగువాన్ గుప్త , రాయి కంటి ముత్యాల గుప్తా, పెద్ది శ్రీనివాస్ గుప్తా , చంద్రగిరి తారకేశ్వర్ గుప్తా , రాజురి జగదీష్ గుప్తా, రవ్వ ఈశ్వర్ గుప్త , ఎనిశెట్టి మురళి గుప్తా, పెద్ది నవీన్ గుప్తా, అనుములు నర్సింగ్ గుప్త, కోటం శెట్టి రామలింగయ్య శెట్టి, తదితరులు పాల్గొన్నారు.





## మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

- **జూన్ 9, 10 తేదీలలో రెండు రోజుల శిక్షణ**
- **జిల్లా జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలి**
- **విజ్ఞప్తి చేసిన జిల్లా కమిటీ**

మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి) : జూన్ 9, 10 వ తేదీలలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు మంగళవారం మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి ని సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్రాంరెడ్డి లు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జూన్ 9, 10 వ తేదీలలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 50 మంది జర్నలిస్టులకు నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెండు రోజులపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు ప్రొఫెసర్లతో, సీనియర్ జర్నలిస్టులతో తరగతులు జరుగుతాయని అన్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనాలను మీడియా అకాడమీ ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు. రెండు రోజులు శిక్షణ పొందిన వారికి మీడియాకాడమీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను కూడా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి అధ్యక్షులు ఎంఏ కరీం, ఉప్పల్ నియోజకవర్గం యూనియన్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు తిరుపతి రెడ్డి, నరోత్తం రెడ్డిలు పాల్గొన్నారు.

## అమావాస్య అన్న ప్రసాద వితరణ



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ప్రతినెలా మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించే అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం మంగళవారం కుషాయిగూడ పోచమ్మ దేవాలయంలో నిర్వహించారు. ముందుగా కుషాయిగూడ పెద్ద గౌడు మండల దాసు గౌడ్, మండల గోపీనాథ్ గౌడ్, పారిశ్రామికవేత్త అశోక్ రెడ్డి లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మారుతి మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి వరగంటి హనుమంతు, మచ్చ బాబుగౌడ్, గురుమంచి వేను చారి, కాసుల సురేష్ గౌడ్, అల్లాదుర్గం సతీష్, గుంటి ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధి కి హనుమాన్ భక్త బృందం స్వాములు విరాళం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయంలో మండల , అర్ధమండల, పాము మండల హనుమాన్ దీక్షలు పాటించిన హనుమాన్ భక్త బృందం స్వాములు ఆలయ అభివృద్ధి కోసం రూ.18,000 లను మంగళవారం విరాళంగా అందజేశారు. రూ.18 వేల నగదును బస్తీ వెల్ఫేర్ సమక్షంలో ఆలయ కమిటీ అందజేశారు. ఈ సందర్భంగా బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రారెడ్డి మాట్లాడుతూ హనుమాన్ దీక్ష చేపట్టే స్వాములు ఆలయ అభివృద్ధి లో భాగస్వామ్యం పంచుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం ఆలయ ప్రాంగణంలోని కమిటీ హాల్ లో స్వాములు దీక్ష చేసుకునేందుకు అన్ని వసతులను కల్పిస్తూ సహకరిస్తున్న బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్, ఆలయ కమిటీ సభ్యులు, ఇతర నేతలకు స్వాములు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేర్ని ధర్మారావు, బస్తి ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, సభ్యులు హనుమంత రెడ్డి, శంకర్ రెడ్డి , తాటి కిరణ్ కుమార్ లతో పాటు హనుమాన్ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశారు

- **వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశారని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. అమెరికా న్యూ జెర్సీ లోని ప్రిన్సన్ లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ , డలాస్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సన్నాహక వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బాల్కా సుమన్ , మాజీ ఎమ్మెల్యే గద్దరి కిషోర్ , మాజీ కార్పొరేషన్ చైర్మన్ గ్యదారి బాలమల్లు , మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ చంటి లతో కలిసి కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చావు నోట్ల తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర డెవలప్మెంట్ కోసము అలుపెరుగని కృషిచేసి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టి తెలంగాణ ప్రజలు సగర్వంగా తల ఎత్తుకునేలా చేశారని అన్నారు. డలాస్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ , బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొనే కార్యక్రమానికి ఎన్నారై సోదరులు అందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

# ఏసీబీ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు

: విజయ్‌కుమార్

హైదరాబాద్: అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) అధికారులమని ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ డైరెక్టర్ విజయ్ కుమార్ తీవ్రంగా హెచ్చరించారు. ఇలాంటి మోసాలు తమ దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఏసీబీ అధికారులు ఎవరూ కేసుల విషయంలో కానీ, ఇతర కారణాలతోనూ డబ్బులు డిమాండ్ చేయరని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఈ మోసగాళ్లు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారని తెలిసిందని ఏసీబీ డైరెక్టర్ తెలిపారు. తాజాగా ఖమ్మం జిల్లాలోని టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓ నకిలీ ఏసీబీ అధికారిపై కేసు నమోదైందని వెల్లడించారు. ఏసీబీ అధికారులుగా చెప్పుకొంటూ ఎవరైనా ఫోన్ చేస్తే ప్రభుత్వ ఉద్యోగులకు తక్షణమే అప్రమత్తమై ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డైరెక్టర్ హామీ ఇచ్చారు.



## హైదరాబాద్‌లో వర్షం..
## జలమయమైన రహదారులు

హైదరాబాద్: పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షం కురుస్తోంది. హైదరాబాద్‌లో సాయంత్రం నుంచి వివిధ ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. సికింద్రాబాద్, అల్వాల్, లింగంపల్లి, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, సూరారం, బోరబండ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. రహదారులపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



## రాజీవ్ యువవికాసం..
## తొలి విడతలో రూ.లక్షలోపు యూనిట్లు

హైదరాబాద్:రాజీవ్ యువవికాసంపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. జూన్ 15 తర్వాత రాజీవ్ యువ వికాసం యూనిట్ల గ్రౌండింగ్ ఉంటుందని, అక్టోబర్ 2 నాటికి 5లక్షల మందికి దశలవారీగా లబ్ధి చేకూరేలా ప్రణాళిక వేసినట్లు తెలిపారు. తొలి విడతలో రూ.లక్షలోపు యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు.

## జాగృతి నేతలతో ఎమ్మెల్సీ కవిత సమావేశం



హైదరాబాద్: తెలంగాణ జాగృతి నేతలతో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో వారితో భేటీ అయ్యారు. సింగరేణి ప్రాంత జాగృతి నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో తాజా పరిణామాలు, జాగృతి తరపున చేపట్టే కార్యక్రమాలపై చర్చించినట్లు సమాచారం.

## గాలి జనార్ధనరెడ్డిని
## బెంగళూరుకు తరలించిన పోలీసులు



హైదరాబాద్: ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో దోషి గాలి జనార్దనరెడ్డిని చంచల్‌గూడ జైలు నుంచి బెంగళూరుకు తరలించారు. ఆయన్ను పీటీ వారెంట్‌పై బెంగళూరు పోలీసులు తీసుకెళ్లారు. గాలి జనార్దనరెడ్డిపై బెంగళూరులో పలు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడలో జైలులో ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే.

## కాళేశ్వరం పుష్కరాలపై మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలు విజయవంతం కావడంపై మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. సరస్వతీ పుష్కరాలు విజయవంతం కావటం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తొలి పుష్కరాలు అద్భుతంగా జరిగాయి. 30 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, కాళేశ్వర ముక్తీశ్వరుడి దర్శనం చేసుకున్నారు. ఇందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు, స్థానిక ప్రజలకు, భక్తులకు ధన్యవాదాలు. రాబోయే రోజుల్లో వచ్చే గోదావరి పుష్కరాలను మరింతగా గొప్పగా జరుపుకుందాం. ఈ పుష్కరాలు విజయవంతం కావటంలో కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక అధికారులు, ఎండోమెంట్ డిపార్టుమెంటు వారికి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతూ మంత్రి కొండా సురేఖ ప్రకటన విడుదల చేశారు. కాగా, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సరస్వతీ పుష్కరాలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. పదకొండు రోజుల పాటు నిర్వహించిన ఈ పుష్కరాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పుష్కర ఘాట్లు కిక్కిరిసిపోయాయి. పుష్కరాల మొదటి రోజున లక్ష మంది భక్తులు హాజరైతే, చివరి రోజున మాత్రం 3.7 లక్షల మంది యాత్రికులు పుణ్యస్నానాలు చేశారు. పుష్కరాలు నిర్వహించిన 11 రోజుల్లో మొత్తం 23.1 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలు, పూజలు నిర్వహించారు. వీరంతా రాష్ట్రం నుంచే కాకుండా సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

## రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవం..
## పద్మశ్రీ అందుకున్న మందకృష్ణ మాదిగ

పద్మ అవార్డుల రెండవ విడత ప్రదానోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో నటి, భరతనాట్య కళాకారిణి శోభన చంద్రకుమార్ పద్మభూషణ్ అవార్డు, సామాజిక కార్యకర్త ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. ఈ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్వీకరించారు. శోభన.. మలయాళ సినిమా నటి, భరతనాట్య నృత్యకారిణిగా 40 ఏళ్లకు పైగా సినిమా, నృత్య రంగాల్లో చేసిన కృషికి గాను పద్మభూషణ్ అందుకున్నారు. ఆమె 80కి పైగా సినిమాల్లో నటించి.. రెండు జాతీయ అవార్డులు, అనేక రాష్ట్ర అవార్డులు గెలుచుకున్నారు. మందకృష్ణ మాదిగ.. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడిగా, దళితుల హక్కుల కోసం, మాదిగ సామాజిక వర్గం ఉద్యమానికి చేసిన కృషికి పద్మశ్రీ అవార్డు పొందారు. 2025 పద్మ అవార్డుల్లో మొత్తం 139 మందికి అవార్డులు అందించారు. అందులో 7 మందికి పద్మ విభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ అవార్డులు ఉన్నాయి. రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 25, 2025న ఈ





## కాళేశ్వరం కమిషన్ ముందుకు కేసీఆర్

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకోనుంది. కాళేశ్వరం కమిషన్ విచారణకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హాజరు కానున్నారని సమాచారం. కాగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి, నిర్మాణ లోపాలపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ వైఫల్యాలు, ఆర్థిక అక్రమాలపై దర్యాప్తు చేస్తోంది. ఇప్పటివరకు 100 మందికి పైగా అధికారులు, నిపుణులను విచారించిన కమిషన్, 400 పేజీల నివేదికను సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో మే 21న మాజీ సీఎం కేసీఆర్‌కు కమిషన్ నోటీసులు జారీ చేసింది. జూన్ 5, 2025న విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మాజీ మంత్రులు హరీశ్ రావు (జూన్ 6), ఈటల రాజేందర్ (జూన్ 9)లకు కూడా నోటీసులు అందాయి. అయితే ఈ విచారణకు కేసీఆర్ హాజరు కావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే స్వయంగా హాజరవుతారా లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతారా అనేది తెలియాల్సి ఉంది. అయితే ఈ విచారణలో.. కేసీఆర్ సూచనల మేరకే బ్యారేజీల స్థల ఎంపిక, డిజైన్ మార్పులు జరిగాయని, ఈ నిర్ణయాల వల్లే ప్రాజెక్ట్ వైఫల్యం, రూ.1.2 లక్షల కోట్ల ఖర్చు జరిగిందని అధికారులు కమిషన్ ముందు వెల్లడించారు. ఇటీవలే కమిషన్ గడువు జులై 31 వరకు పొడిగించబడింది. కేసీఆర్ హాజరైతే, ఆయన వివరణ తీసుకుని తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది. లేకపోతే ఏకపక్ష నివేదికపై కేసీఆర్ కోర్టుకు వెళ్లవచ్చనే చర్చ కూడా జోరుగా జరుగుతోంది.

## ఫలించిన ఎంపీ అర్వింద్ ప్రయత్నం

నిజామాబాద్ మే 27: నిజామాబాద్‌లోని జాతీయ పసుపుబోర్డుకు ఎట్టకేలకు అన్ని హంగులతో సౌకర్యంగా ఉన్న కార్యాలయం లభ్యమైంది. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి దాదాపు మూడు నెలలుగా చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఎట్టకేలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు కోసం నిజామాబాద్ నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెలవారీ అద్దె ప్రాతిపదికపై కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వాస్తు దోషం సాకుతో రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఉపయోగించడం లేదు. దీంతో ఏడాదిన్నర కాలంగా ఈ కార్యాలయం వృథాగానే పడి ఉంది.


## జూన్ 3 నుంచి 10th సప్లమెంటరీ పరీక్షలు..



తెలంగాణలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం అయ్యాయి. జూన్ 3 నుంచి జూన్ 13 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 42,832 మంది విద్యార్థులు హాజరవనున్నారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 150 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9:30గంటలనుంచిమధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను తెలంగాణ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ bse.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బోర్డ్ తెలిపింది. హాల్‌టికెట్ లేకుండా పరీక్షకు హాజరు కానివ్వబోమని స్పష్టం చేసింది. విద్యార్థులు ఉదయం 9:00 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించింది. మార్చి 2025లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఈ పరీక్షలు నిర్వహిస్తుండగా.. ఇప్పటికే ఫీజు చెల్లింపు గడువు ముగిసింది. అలస్య రుసుముతో మే 16 నాటికే పరీక్ష ఫీజు చెల్లింపు పూర్తయ్యింది. ఇక ఈ పరీక్ష ఫలితాలు జులై 2025లో విడుదలయ్యే అవకాశం ఉంది.

# ఒక విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తారా..? బాంబే హైకోర్టు ఆగ్రహం

ఒక విద్యార్థిని అరెస్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆమె జీవితం నాశనం చేస్తారా..? అని ప్రశ్నించింది. ఇంతకీ ఏం జరిగిందంటే..? మహారాష్ట్రలో పుణెలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోన్న 19 ఏళ్ల విద్యార్థిని.. ఆపరేషన్ సిందూర్‌పై పోస్టు పెట్టింది. అది విమర్శనాత్మకంగా ఉండటంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. తర్వాత ఆమెను పుణెలోని ఎరవాడ జైల్లో ఉంచారు. దీనిపై ఆ విద్యార్థిని హైకోర్టును ఆశ్రయించారు. సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని ఈ పిటిషన్‌ను వెంటనే విచారించాలని ఆమె తరఫు న్యాయవాది అభ్యర్థించారు. దీనిని



పరిగణనలోకి తీసుకునేందుకు హైకోర్టు ధర్మాసనం అంగీకరించింది. ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆమెను విడుదల చేయాలని ఆదేశించింది. తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేసినంత మాత్రాన అరెస్టు చేయలేరని అసహనం వ్యక్తంచేసింది. “ఇదేం ప్రవర్తన..? ఒక విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తున్నారా..? ఆమెను వివరణ కోరారా..?” అని ప్రశ్నలు వేసింది. ఇక ఆమె పోలీసుల భద్రతతో పరీక్షలకు హాజరుకావొచ్చని కళాశాల తరఫు న్యాయవాది వినిపించిన వాదనను తోసిపుచ్చింది. ఆమె నేరస్థురాలు కాదని పేర్కొంది.

## భారత సరిహద్దులో ఓ పోస్టుకు 'సిందూర్' పేరు!

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో చావు దెబ్బకొట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత సైన్యం చూపిన తెగువకు గుర్తుగా సాంబా సెక్టార్‌లోని ఓ పోస్టుకు 'సిందూర్' అని పేరు పెట్టాలని భారత సరిహద్దు భద్రతా దళం (BSF) ప్రతిపాదించింది. మే 10న సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో అమరులైన మరో ఇద్దరి పేర్లను కూడా పరిశీలించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. మే 10న సరిహద్దు పాక్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు బీఎస్‌ఎఫ్ జవాన్లు, మరో భారత సైనికుడు మరణించారని బీఎస్ఎఫ్ ఐజీ జమ్మూ ఫ్రాంటియర్ శశాంక్ ఆనంద్ అన్నారు. “మే 10న పాకిస్థాన్ మా పోస్టులను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులకు పాల్పడింది. బీఎస్ఎఫ్ దళాలు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటున్న సమయంలో బృందంలోని బీఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఇంతియాజ్, కానిస్టేబుల్ దీపక్ కుమార్ ప్రాణాలు కోల్పోయారు. కాబట్టి సరిహద్దులోని




పోస్టుకు వారి పేర్లను కూడా పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాము'' అని శశాంక్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బీఎస్ఎఫ్ మహిళా సిబ్బంది ఎంతో తెగువతో ఫార్వర్డ్ పోస్టులపై పాక్‌తో పోరాడారని శశాంక్ ప్రశంసించారు. అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలో మహిళా బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్లు పాక్ డ్రోన్‌లను సమర్థవంతంగా తిప్పికొట్టారని తెలిపారు. మరోవైపు భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడంతో ఉగ్రవాదులు భారత్‌లో చొరబాటుకు ప్రయత్నిస్తున్నారని.. పాక్ ఆక్రమిత కశ్మీర్ వెంబడి వారు చొరబడే అవకాశం ఉందని నిఘా వర్గాలు పేర్కొన్నాయన్నారు. కాబట్టి భద్రతా దళాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### పాక్ సైన్యం గుండెల్లో 'విధ్వంసక్'..

## ఆపరేషన్ సిందూర్‌లో కీలకం..!

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ దాడులను దీటుగా తిప్పికొట్టిన సరిహద్దు భద్రతా దళం.. శత్రు సైన్యానికి చుక్కలు చూపించిన సంగతి తెలిసిందే. ఓవైపు మన గ్రామాలపైకి దూసుకొచ్చిన డ్రోన్లు, క్షిపణులను నిర్వీర్యం చేస్తూనే.. వారి స్థావరాలను, టవర్లు, బంకర్లే లక్ష్యంగా దాడులు చేసింది. ఇలా ఆపరేషన్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన 72 పోస్టులు, 47 వ్యూహాత్మక ప్రాంతాలను (ఫార్వర్డ్ పోస్టులు) ధ్వంసం చేసినట్లు బీఎస్ఎఫ్ వెల్లడించింది. పాకిస్థాన్‌ను విశ్వసించలేమని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని సరిహద్దు భద్రతా దళం స్పష్టం చేసింది. చొరబాటుదారుల ముప్పు అధికంగా ఉన్న నేపథ్యంలో అంతర్జాతీయ సరిహద్దుల్లో అత్యంత అప్రమత్తంగా ఉన్నామని తెలిపింది. జమ్మూ బీఎస్ఎఫ్ హెడ్‌క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన ఆయుధాల ప్రదర్శన సందర్భంగా.. ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించిన



'విధ్వంసక్'తో పాటు ఇతర ఆయుధాల గురించి బీఎస్ఎఫ్ అధికారులు వివరించారు.

**ఏమిటీ విధ్వంసక్..?**

దేశీయంగా అభివృద్ధి చేసిన 'యాంటీ మెటీరియల్ రైఫిల్' ఇది. విధ్వంసక్ పరిధి 1300 మీటర్ల నుంచి 1800 మీటర్లు. అవసరానికి అనుగుణంగా బ్యారెల్స్, బోల్టులు, మ్యాగజైన్లను మార్చుకోవచ్చు. ఒక్కో మ్యాగజైన్‌లో మూడు రౌండ్లు ఉంటాయి. శత్రువుల రహస్య ప్రదేశాలు, బంకర్లు, ట్యాంకర్లు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను నాశనం చేయగలదు. దేశీయంగా తయారుచేసిన ఈ ఆయుధం.. ఆపరేషన్ సిందూర్ సమయంలో అన్ని లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించారు. ''ఇది ఆటోమేటిక్ గ్రెనేడ్ సిస్టమ్‌తో పనిచేసే మీడియం మెషిన్‌గన్. ఈ 12.7 ఎంఎం యాంటీక్రాఫ్ట్ కలిగి ఉండే దీనిని ఆపరేట్ చేసేందుకు ముగ్గురు సిబ్బంది అవసరం. నిమిషానికి 650-1000 రౌండ్ల వరకు కాల్పులు జరుపుతుంది. ప్రవహించే నీటిని కూడా ఆపగలదు. పేలుడు ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. దీన్నుంచి వెళ్లే గ్రెనేడ్ పడినచోట 10 మీటర్ల పరిధిలో ఉన్న వ్యక్తులను చంపగలదు. ఇటీవల ఆపరేషన్‌లో పాక్ దాడులను ఎదుర్కొనేందుకు దీన్ని ఉపయోగించాం. దీంతోనే పాక్ అబ్జర్వేషన్ ఔట్‌పోస్టును ధ్వంసం చేశాం. ఈ ఆయుధంతో శత్రుమూకలు సరిహద్దు నుంచి తోకముడిచాయి'' అని బీఎస్ఎఫ్ అధికారులు పేర్కొన్నారు.



## సుక్మా జిల్లాలో 18 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పోలీసుల ఎదుట 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) బెటాలియన్‌లో చురుకుగా ఉన్న నలుగురితో సహా 18 మంది లొంగిపోయారు. వారిలో 10 మందిపై గతంలో మొత్తం రూ.38 లక్షల రివార్డు ప్రకటించారు. సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ముందు వీరు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న నక్సల్ రహిత గ్రామ పంచాయతీ పథకం కింద సాధించిన విజయంగా దీన్ని ఎస్పీ పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో పెద్దఎత్తున మావోయిస్టులను భద్రతాదళాలు మట్టుబెట్టాయి. ఈ నేపథ్యంలో వీరు లొంగిపోయినట్లు తెలుస్తోంది.

### పహల్గాంలో క్యాబినెట్ భేటీ..

## పోస్టు పెట్టిన సీఎం ఒమర్ అబ్దుల్లా


జమ్మూకశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడితో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఘటనాస్థలంలో ప్రత్యేక క్యాబినెట్ సమావేశం జరిగింది. పిరికిపంద చర్యలకు తాము ఏమాత్రం భయపడబోమనే సందేశాన్ని పంపుతూ జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఈ సమావేశాన్ని నిర్వహించింది. ఈ ప్రభుత్వ హయాంలో వేసవి రాజధాని శ్రీనగర్, శీతాకాల రాజధాని జమ్ము వెలుపల ఇలా మంత్రులు భేటీ కావడం ఇదే తొలిసారి అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. ప్రకృతి అందాలకు నెలవైన పహల్గాంలోని బైసరన్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు బలయ్యారు. దాంతో అప్పటినుంచి పర్యాటకుల రాక తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో పర్యాటకంపైనే ఆధారపడిన, ఉగ్రదాడితో భీతావహులైన స్థానిక



ప్రజలకు సంఘీభావంగా ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు సీఎం మీడియాకు వెల్లడించారు. ''మేం ప్రజల ధైర్యానికి సెల్యూట్ చేస్తున్నాం. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పహల్గాంకు వచ్చాం. ఆ దిశగా చర్యలు కొనసాగుతాయి'' అని అన్నారు. పహల్గాం క్లబ్‌లో జరిగిన మీటింగ్ దృశ్యాలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ''ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు ఏ మాత్రం భయపడేదిలేదనే స్పష్టమైన సందేశాన్ని ఇచ్చేందుకే ఇక్కడకు వచ్చాం. జమ్మూకశ్మీర్ దృఢంగా నిలుస్తుంది'' అని ఆ పోస్టులో రాసుకొచ్చారు. 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఆయన ఉత్తర కశ్మీర్‌లోని గురెజ్, మచిల్, తాంగ్‌ధర్, జమ్మూప్రాంతంలోని రాజౌరీ, పూంచ్‌లోనూ ఇలా క్యాబినెట్ సమావేశాలు నిర్వహించారు. ప్రధాని మోదీ అధ్యక్షత వహించే నీతిఆయోగ్ సమావేశాన్ని ఇక్కడ నిర్వహించాలని అభ్యర్థించారు. ఈ తరహా చర్యలు స్థానిక ప్రజల్లో భయాలను తొలగిస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు.

## జ్యోతి మల్హోత్రా గ్యాడ్జెట్లలో 12టెరా బైట్ల డేటా..!

పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తోందన్న ఆరోపణలపై అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. తనతో టచ్‌లో పాక్ అధికారులు ఇంటర్‌సర్వీస్ ఇంటెలిజెన్స్‌తో కలిసి పనిచేస్తున్నారని జ్యోతికి తెలుసని దర్యాప్తుతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. కానీ ఆమె భయపడకుండా ఆ సంప్రదింపులు కొనసాగించారని పేర్కొన్నాయి. ఆమె ల్యాప్‌టాప్, ఫోన్‌లోని సమాచారం ఆధారంగా ఈ విషయాన్ని వెల్లడించాయి. గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయిన జ్యోతి ల్యాప్‌టాప్, ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. వాటిల్లో అప్పటికే తొలగించిన సమాచారాన్ని అధికారులు రికవరీ చేశారని, అదంతా 12టెరాబైట్ల మేర ఉందని సమాచారం. ఈ కేసులో మరిన్ని ఆధారాల కోసం ఆ డేటాను స్కాన్ చేస్తున్నారు. తాను ఐఎస్ఐకు సంబంధించిన వ్యక్తులతో మాట్లాడుతున్నానని తెలిసే, కాంటాక్ట్ కొనసాగించారని ఆ సమాచారం ఆధారంగా ప్రాథమికంగా గుర్తించారు. జ్యోతి నలుగురు పాక్ ఐఎస్ఐ ఏజెంట్లతో నేరుగా మాట్లాడిందని, వారిలో డానిష్, అహ్సన్, షాహిద్ ఉన్నారని ఆ వర్గాలు వెల్లడించాయి. ఐఎస్ఐలో ఆ ఏజెంట్ల హోదాలు, ఉద్యోగాలు ఏంటో ధ్రువీకరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక..జ్యోతి మల్హోత్రాకు పాక్‌లో ఆరుగురు వ్యక్తులు ఏకే 47లతో భద్రత కల్పించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. వారు ధరించిన జాకెట్లపై ''నో ఫియర్'' అని రాసి ఉన్నట్లు కనిపించింది. ఇక, 2023లో వీసా కోసం పాక్ హైకమిషన్‌కు వెళ్లిన సమయంలో తొలిసారి డానిష్ పరిచయం అయ్యాడని వెల్లడించింది. పాక్ హైకమిషన్ కార్యాలయానికి వీసా కోసం వచ్చే వారిని ట్రాప్ చేసి వారిని డానిష్ గూఢచర్యానికి వాడుకొనేవాడని.. యూట్యూబర్ జ్యోతి కూడా వీసా కోసం వెళ్లగా ఆమెను ట్రాప్ చేశాడని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఇంతకాలం పోలీస్ రిమాండ్‌లో ఉన్న జ్యోతిని కోర్టు నిన్న 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపింది. పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్ పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. కొన్ని వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 10 మందికిపైగా అరెస్టయిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈమేరకు



చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# తొలిరోజు ముగిసిన టీడీపీ మహానాడు.. రేపు చర్చించే అంశాలివే!

టీడీపీ మహానాడు కార్యక్రమం ఈ రోజు (మంగళవారం) కడప జిల్లాలో ఘనంగా జరిగింది. 2024 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడు కావడంతో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. కడపలో మూడు రోజుల పాటు జరగనున్న మహానాడు తొలి రోజు కార్యక్రమం ముగిసింది. మొదటి రోజు ముగిసిన టీడీపీ మహానాడులో టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు, మంత్రులు, టీడీపీ నేతలు హాజరయ్యారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు కార్యక్రమంలో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. పలువురు మంత్రులు కూడా పలు విషయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో మంత్రి నారా లోకేష్ తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం మంత్రి నారా లోకేష్ 6 శాసనాలను ఇవాళ జరిగిన టీడీపీ మహానాడులో ప్రతిపాదించారు.






## గోదావరిలో ముగ్గురు యువకులు గల్లంతు

జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. తూర్పుగోదావరి జిల్లాలోని పి.గన్నవరం మండలం ఆచంట మండలం రావి లంక వద్ద వశిష్ఠ గోదావరిలో నాగుల్లంక గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. ఈ రోజు (మంగళవారం) ఐదుగురు యువకులు గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ముగ్గురు గోదావరి నీటిలో మునిగి పోయినట్లు చెబుతున్నారు. వారి బట్టలు సెల్ ఫోన్లు గోదావరి వద్ద గుర్తించారు. వారితో పాటు వెళ్లిన ఇరువురు తిరిగి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. మునిగిపోయిన వారిలో సానబోయిన సూర్యతేజ, నీతి పూడి పవన్ కుమార్, కేతా ప్రవీణ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అంతర్జాతీయ ప్రయాణికులకు గుడ్‌న్యూస్..
# విశాఖ నుంచి అబుదాబికి విమాన సర్వీసు



విశాఖపట్నం: ఏపీ నుంచి వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికులకు శుభవార్త. విశాఖ నుంచి అబుదాబికి అంతర్జాతీయ విమాన సర్వీసులు జూన్ 13 నుంచి ప్రారంభం కానున్నాయి. వారానికి నాలుగు రోజులు సర్వీసు అందుబాటులో ఉంటాయి. సోమ, బుధ, శుక్ర, ఆదివారాల్లో ఉదయం 8.20 గంటలకు విమానం విశాఖ విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుంచి ఉదయం 9.50 గంటలకు అబుదాబికి పయమవుతుందని అధికారులు తెలిపారు. దేశీయంగా విశాఖభువనేశ్వర్ మధ్య విమాన సర్వీసు నడిపించేందుకు ఒడిశా ప్రభుత్వం సహకారం అందించింది. జూన్ 15 నుంచి సర్వీసు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 1.55కి విశాఖ చేరుకొని తిరిగి 2.25కి భువనేశ్వరకు వెళ్తుంది.

## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్ పొడిగింపు




అమరావతి: ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసు నిబంధనల ఉల్లంఘనపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం అతన్ని సస్పెండ్ చేసింది. సంజయ్‌పై వచ్చిన అభియోగాల విచారణపై ఏర్పాటైన కమిటీ సిఫార్సులతో 2024 డిసెంబరు 3న సస్పెండ్ చేస్తూ ఆదేశాలు వెలువరించింది. ఆ తర్వాత సస్పెన్షన్‌ను 2025 మే 31 వరకు పొడిగించింది. ఆ సస్పెన్షన్‌ను ఈ ఏడాది నవంబర్ వరకు మరోసారి పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

## డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు..
# సినిమా థియేటర్లలో అధికారుల తనిఖీలు

కాకినాడ: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఆర్డీవో, ఎమ్మార్వో, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాకినాడ సినిమారోడ్డులో చాణక్య, చంద్రగుప్త థియేటర్లలో తనిఖీలు నిర్వహించారు. పెద్దపూడి, కాజులూరు, తాళ్లరేవు, కరప, కాకినాడ, కాకినాడ రూరల్ ఎమ్మార్వోలు తనిఖీల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సినిమాహాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్.. సినిమాలు హాళ్ల బంద్ ప్రకటన, ఈ క్రమంలో తమ శాఖ ద్వారా చేపట్టిన చర్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పలు కీలక సూచనలు చేశారు.




*** తినుబండారాల ధరలపై విచారణ చేపట్టండి**

టికెట్ ధర కంటే సినిమా హాళ్లలో పాప్‌కార్న్ సహా ఇతర తినుబండారాలు, శీతల పానీయాలు, చివరకు మంచి నీళ్ల సీసాల ధరలు సైతం భారీగా ఉండటంపై ఈ సందర్భంగా చర్చించారు. వాటి వాస్తవ ధరలు.. ప్రస్తుతం ఎంతకు విక్రయిస్తున్నారు.. అసలు వాటిలో ఉండే నాణ్యత ప్రమాణాలు ఏమిటనేది కూడా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరల నియంత్రణ చేపట్టాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్స్‌లో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలోనూ గుత్తాధిపత్యం సాగుతోందనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. ప్రేక్షకులు కుటుంబ సమేతంగా సినిమా హాలుకు రావాలంటే తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి రాకూడదని అభిప్రాయపడ్డారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్యా పెరిగి, పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం మెరుగవుతుందన్నారు. ఈ అంశంపై పన్నుల శాఖతో పరిశీలన చేయించాలన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగి థియేటర్లలో తనిఖీలు చేపట్టారు.

## భారత స్టాండర్డ్‌లు ప్రపంచ ప్రామాణికంగా మారుతున్నాయి

**: నాదెండ్ల మనోహర్**



దిల్లీ: భారత స్టాండర్డ్‌లు ఇప్పుడు ప్రపంచప్రామాణికంగా మారుతున్నాయని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. 201415లో భారత్‌లో కేవలం 2,000 స్టాండర్డ్స్ మాత్రమే ఉన్నాయని.. 2025 నాటికి ఆ సంఖ్య 23,000లకు చేరిందన్నారు. ప్రమాణీకరణ సంఖ్యను 55వేలకు పెంచడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమన్నారు. భారత్ తయారు చేసిన స్టాండర్డ్స్ 95 శాతం హార్మొనైజ్డ్‌గా గుర్తింపు పొందాయని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమన్వయం చేశారని వివరించారు. హాల్ మార్కింగ్ విషయంలో గణనీయమమైన అభివృద్ధి జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 371 జిల్లాల్లో బంగారం హాల్ మార్కింగ్ అమలులో ఉందన్నారు. దేశ వ్యాప్తంగా విస్తరణలో భాగంగా ప్రతి జిల్లాలో హాల్ మార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. త్వరలో బులియన్ హాల్ మార్కింగ్ ప్రారంభిస్తామని, వెండి ఆభరణాలపై హాల్ మార్కింగ్ కోసం విధాన ప్రకటన చేస్తామని కేంద్రమంత్రి తెలిపారని నాదెండ్ల మనోహర్ చెప్పారు. భారత దేశంలో ప్రమాణాల పరిరక్షణ, నాణ్యత నియంత్రణ, వినియోగదారుల న్యాయ హక్కుల పరిరక్షణలో బీఐఎస్ పాత్ర స్పష్టంగా ప్రతిబింబిస్తోందన్నారు.

# తెదేపా 'మహానాడు' వేడుక విజయవంతం కావాలి

**: డిప్యూటీ సీఎం పవన్**



అమరావతి: 'మహానాడు' ఈ పదం విన్నా, చదివినా వెంటనే గుర్తుకు వచ్చేది తెలుగుదేశం పార్టీనే అని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అంతలా తెలుగువారి గుండెల్లో స్థిరపడిపోయింది ఏటా జరిగే ఈ వేడుక అని పేర్కొన్నారు. "రాయలసీమ గడ్డపై కడపలో అంగరంగ వైభవంగా మహానాడు చారిత్రక రాజకీయ పండుగ నేడు ప్రారంభమైన శుభవేళ నా పక్షాన, జనసేన పార్టీ పక్షాన తెదేపా జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ, తెలంగాణలో పార్టీకి రాష్ట్ర అధ్యక్షులుగా సేవలందిస్తున్న పల్లా శ్రీనివాస్, బక్కని నరసింహులుకు శుభాభినందనలు. ప్రజాసేవ, ప్రజా ప్రయోజనమే పరమావధిగా జరుగుతున్న ఈ మూడు రోజుల వేడుకలో చర్చించనున్న ఆరు అంశాలు ప్రశంసనీయంగా ఉన్నాయి. కార్యకర్తే అధినేత, యువ గళం, స్త్రీ శక్తి, సామాజిక న్యాయం, పేదల ప్రగతి, అన్నదాతకు అండగా వంటి అంశాలపై ఈ మహానాడులో చర్చించి.. అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించడం అభినందనీయం. పసుపు వర్ణంతో ముస్తాబైన మహానాడు ప్రాంగణం శోభాయమానంగా కనువిందు చేస్తోంది. ఈ వేడుక విజయవంతంగా జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు... కేటీఆర్ పిలుపు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జూన్ 2వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాలతో పాటు, నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఎగురవేసి, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున సంబరాలు జరపాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో పార్టీ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి పాల్గొని జాతీయ పతాకాన్ని, పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని వెల్లడించారు. ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అదేవిధంగా, రాష్ట్రంలోని అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో జిల్లా అధ్యక్షుల నేతృత్వంలో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాలను ఎగురవేసి సంబరాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కేంద్రాలతో పాటు అన్ని నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాల్లోనూ జాతీయ పతాకాన్ని, గులాబీ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ అవతరణ సంబరాలను ప్రజలతో కలిసి జరుపుకోవాలని కేటీఆర్ అన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "14 ఏళ్ల అలుపెరగని పోరాటం, ఉద్యమ రథసారథి కేసీఆర్ సారథ్యంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలి" అని తెలిపారు. అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల సమష్టి కృషితోనే ఆరు దశాబ్దాల కల సాకారమైందని ఆయన గుర్తు చేశారు. "కొట్లాడి సాధించుకున్న తెలంగాణ తొలి పదేళ్ల ప్రస్థానం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

# సిందూర రేఖ ఎంత ముఖ్యమో ప్రపంచానికి తెలిసింది: అమిత్ షా

ఆపరేషన్ సిందూర్ గురించి కేంద్రహోంమంత్రి అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. మన తల్లులు, సోదరీ మణుల నుదుటిపై ఉండే ఆ సిందూర రేఖ ఎంత ముఖ్యమో ప్రపంచానికి చాటిచెప్పామని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. "సిందూరం ప్రాముఖ్యత ప్రపంచానికి తెలిసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు నిర్వహించి.. దేశం గర్వపడేలా చేశాం. నరేంద్రమోదీకి మాత్రమే అది సాధ్యం. మన దేశంలో శాంతిభద్రతలకు భంగం కలిగించాలనుకున్నవారిని వెనక్కి పంపేశాం. వారిప్పుడు బాధతో మూలుగుతున్నారు'' అని అమిత్ షా వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ బలమైన రాజకీయ సంకల్పం.. నిఘా సంస్థలు అందించిన కచ్చితమైన సమాచారం.. త్రివిధ దళాల అద్భుత ప్రదర్శన వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యిందని గతంలో ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో 9 ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం



ధ్వంసం చేసిందని.. వాటిలో 2 ప్రధాన ఉగ్ర కార్యాలయాలు ఉన్నాయని ఇప్పటికే అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ దాడిలో పాక్ ప్రజలకు గానీ, సైనిక స్థావరాలకు గానీ ఎటువంటి నష్టం కలిగించలేదని స్పష్టంచేశారు. కానీ, ఆ దేశ సైన్యం మాత్రం నిషేధిత ఉగ్రవాదుల అంత్యక్రియలకు హాజరై.. ఉగ్రవాదానికి మద్దతు పలికారని అన్నారు. వారి చర్యలను ప్రపంచం మొత్తం చూసిందని.. ఉగ్రవాదుల వెనక ఎవరు ఉన్నారనే విషయం అన్ని దేశాలకు అర్థమైనట్లు తెలిపారు. పాకిస్థాన్ టెర్రరిజాన్ని ఓ టూరిజంగా భావిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. "నేను పాకిస్థాన్ ప్రజల్ని ఒక విషయం అడగాలనుకుంటున్నా. మీరు ఏం సాధించారు? నేడు భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. కానీ, మీ పరిస్థితి ఏంటి? ఉగ్రవాదాన్ని ప్రోత్సహించిన వారు మీ భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఉగ్రవాదం మీ పాలకులు, సైన్యానికి డబ్బు సంపాదించే మార్గం. దానిని అంతం చేసేందుకు పాక్ ప్రజలు ముందుకు రావాలి. సంతోషంగా, ప్రశాంతంగా జీవించండి'' అన్నారు.

# క్లాస్‌లు ఎగ్గొట్టినా.. వీసా రద్దు: విదేశీ విద్యార్థులకు అమెరికా వార్నింగ్



పలు కారణాలతో విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ.. వారిని దేశం నుంచి బహిష్కరిస్తున్న అగ్రరాజ్యం అమెరికా తాజాగా మరో హెచ్చరిక చేసింది. తమ విద్యా సంస్థల్లో చదివే భారత్ సహా విదేశీ విద్యార్థుల గైర్హాజరు ఆధారంగా కూడా వీసాలను రద్దు చేస్తామని వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా ఎంబసీ దీనిపై మంగళవారం ఓ ప్రకటన జారీ చేసింది. "విద్యాసంస్థ నుంచి డ్రాపౌట్ అయినా.. క్లాస్‌లు ఎగ్గొట్టినా.. విద్యాసంస్థకు చెప్పకుండా స్టడీ ప్రోగ్రామ్ నుంచి వెళ్లిపోయినా మీ స్టూడెంట్ వీసా రద్దవుతుంది. భవిష్యత్తులో ఎలాంటి అమెరికా వీసాలకైనా మీరు అర్హత కోల్పోతారు. సమస్యల బారిన పడకుండా ఉండేందుకు ఈ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోండి. మీ విద్యార్థి వీసాను కొనసాగించుకోండి'' అని యూఎస్ ఎంబసీ ఆ ప్రకటనలో వెల్లడించింది.విదేశీ విద్యార్థులపై ట్రంప్ సర్కారు కన్నెర్ర చేసిన సంగతి తెలిసిందే. పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొన్న వారి దగ్గరుంచి.. చిన్న చిన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వారి వీసాలను కూడా రద్దు చేస్తూ స్వదేశాలకు పంపించేస్తున్నారు. వీరిలో కొందరు భారతీయులు కూడా ఉన్నారు. దీనిపై ఆయా విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఆప్షికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులకు కూడా ఇటీవల యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెచ్చరికలు జారీ చేసింది. ఓపీటీ ట్రైనింగ్‌ను ప్రారంభించిన 90 రోజుల్లోగా ఉపాధిపై స్టేటస్ తెలియజేయాలని, లేదంటే చట్టబద్ధ హోదాను కోల్పోతారని హెచ్చరించింది. ఈ క్రమంలోనే తాజా ప్రకటన వెలువడటంతో విదేశీ విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది.

*** విదేశాల్లో 18 లక్షల మంది భారతీయ విద్యార్థులు**

ఇదిలా ఉండగా విదేశాల్లో భారత విద్యార్థుల సంఖ్య 2025లో 18 లక్షలకు చేరుకుందని భారత విదేశాంగ శాఖ గణాంకాలు వెల్లడించాయి. 2023లో 13లక్షల మంది విద్యార్థులు ఉండగా.. ఈ ఏడాది ఆ సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటివరకు అమెరికాలోనే ఎక్కువ మంది భారతీయులు చదువుతుండగా.. గత కొంతకాలంగా వీరి సంఖ్య తగ్గుతోంది. ఇప్పుడు కెనడా, యూకేలో చదువుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు విదేశాంగ శాఖ గణాంకాలు పేర్కొన్నాయి.గతేడాది అమెరికాలో రికార్డు స్థాయిలో 3,31,602 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. కెనడాలో 1,37,608 మంది, యూకేలో 98,890 మంది



# చైనా కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

చైనాలోని ఓ రసాయన పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. తూర్పు ప్రావిన్సు షాన్‌డాంగ్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారిక మీడియా వెల్లడించింది. వెంటనే రంగంలోని దిగిన రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ప్రాణనష్ట వివరాలు మాత్రం తెలియరాలేదు. ఆ ప్రాంతంలో వందల అడుగుల ఎత్తులో దట్టమైన పొగ వ్యాపించినట్టు సమాచారం.

**భారీ ప్రమాదం..?**

ఈ పేలుడు దాటికి కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇళ్ల కిటికీ అద్దాలు పగిలినట్లు తెలుస్తోంది. ప్రమాద ఘటన నేపథ్యంలో 232 మంది అగ్నిమాపక సిబ్బందితోపాటు రక్షణ చర్యల్లో భాగంగా వైద్య నిపుణులు, పలు ప్రత్యేక బృందాలను అక్కడికి పంపించినట్లు ఎమర్జెన్సీ మేనేజిమెంట్ మంత్రిత్వశాఖ వెల్లడించింది. వీఫాంగ్ నగరం లోని ఇండస్ట్రియల్ పార్కులో ఉన్న షాన్‌డాంగ్ యుడావో రసాయన పరిశ్రమలో ఈ ప్రమాదం చోటు చేసుకున్న తెలుస్తోంది.

## ఎల్ఐసీ లాభం ₹19 వేల కోట్లు..

# ఒక్కో షేరుకు ₹12 డివిడెండ్




దిల్లీ: ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికానికి రూ.19,013 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.13,763 కోట్లతో పోలిస్తే లాభంలో 38 శాతం వృద్ధి నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో ఎల్ఐసీ మొత్తం ఆదాయం రూ.2,50,923 కోట్ల నుంచి రూ.2,41,625 కోట్లకు తగ్గింది. ఈ మేరకు మంగళవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.

* సమీక్షా త్రైమాసికంలో ఎల్ఐసీ తొలి ఏడాది ప్రీమియం వసూళ్లు తగ్గాయి. జనవరి మార్చి మధ్య రూ.11,069 కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.13,810 కోట్లుగా ఉంది.

* రెన్యువల్ చేసిన ప్రీమియం వసూళ్ల వల్ల వచ్చే ఆదాయం పెరిగింది. ఈ మొత్తం రూ.77,368 కోట్ల నుంచి రూ.79,138 కోట్లకు పెరిగింది.

* పూర్తి ఆర్థిక సంవత్సరానికి (202425) ఎల్ఐసీ రూ.48,151 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.40,676 కోట్లుగా ఉంది. 18 శాతం వృద్ధి నమోదైంది.

* పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఆదాయం సైతం రూ.8,53,707 కోట్ల నుంచి రూ.8,84,148 కోట్లకు పెరిగింది.

* త్రైమాసిక ఫలితాల వెల్లడి సందర్భంగా పూర్తి ఆర్థిక సంవత్సరానికి బోనస్‌ను ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.12 చొప్పున డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు సిఫార్సు చేసిందని ఎల్ఐసీ పేర్కొంది.

# రియల్‌మీ జీటీ సిరీస్‌లో కొత్త ఫోన్లు.. ధర, ఫీచర్లు ఇవే..

మొబైల్ తయారీ సంస్థ రియల్‌మీ మిడ్ రేంజ్‌లో జీటీ సిరీస్‌లో కొత్త ఫోన్లను లాంచ్ చేసింది. గతేడాది తీసుకొచ్చిన జీటీ 6కి కొనసాగింపుగా.. జీటీ 7, జీటీ 7టీ ఫోన్లను తాజాగా విడుదల చేసింది. 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, 120W ఫాస్ట్ ఛార్జింగ్ వంటి సదుపాయాలతో ఈ ఫోన్లను తీసుకొచ్చింది. వీటితో పాటు ఆస్టిన్ మార్టిన్ ఎఫ్1 టీమ్‌తో కలిసి కొత్తగా జీటీ7 డ్రీమ్ ఎడిషన్‌ను లాంచ్ చేశారు.




**రియల్‌మీ జీటీ7 వివరాలు**

రియల్‌మీ జీటీ7 6.78 అంగుళాల ఎల్‌టీపీఎస్ అమోలెడ్ 1.5k డిస్‌ప్లేతో వస్తోంది. 120 Hz రిఫ్రెష్ రేటు ఉంది. ఆండ్రాయిడ్ 15తో పనిచేసే రియల్‌మీ యూఐ 6.0తో పనిచేస్తుంది. 6000 నిట్స్‌పీక్ బ్రైట్‌నెస్ ఉంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్‌తో వస్తోంది. మీడియాటెక్ డైమెన్‌సిటీ 9400ఈ చిప్‌సెట్ అమర్చారు. 7,700 ఎంఎం వ్యాపర్ ఛాంబర్ కూలింగ్ సెటప్‌ఉంది. 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 906 ప్రధాన కెమెరా, 50 ఎంపీ టెలిఫొటో లెన్స్, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. ముందువైపు 32 ఎంపీ కెమెరా ఉంది. ఏఐ గ్లేర్ రిమూవల్, ఏఐ ల్యాండ్‌స్కేప్+, ఏఐ ట్రాన్స్‌లేటర్ వంటి ఏఐ ఫీచర్లు ఉన్నాయి. రియల్‌మీ జీటీ 7 మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.39,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీ+256జీబీ వేరియంట్ రూ.42,999, 12జీబీ+512జీబీ వేరియంట్ ధర రూ.46,999 కంపెనీ పేర్కొంది. ఐస్‌సెన్స్ బ్లాక్, ఐస్ సెన్స్ బ్లూ రంగుల్లో లభిస్తుంది.




## ఎయిర్‌టెల్ ఆల్-ఇన్-వన్ ప్లాన్..

# రూ.279 రీఛార్జితో 25+ఓటీటీలు




ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ యూజర్ల కోసం కొత్త ఓటీటీ ప్యాక్‌ను తీసుకొచ్చింది. దేశంలోనే మొట్టమొదటి ఆల్ ఇన్ వన్ ఓటీటీలతో కూడిన ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. నెట్‌ఫ్లిక్స్, జియో సినిమా, జీ5, సోనీలివ్ వంటి 25కు పైగా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఈ ప్లాన్లతో యాక్సెస్ చేయొచ్చు. ఎంట్రీ లెవల్ ప్లాన్ ధర రూ.279గా నిర్ణయించింది. ఓటీటీ ప్లాన్స్‌తో పాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ కావాలనుకొనే వారి కోసం ఇందులో రెండు ప్లాన్లు ఉన్నాయి.

**ప్లాన్ల వివరాలు ఇవే..**

రూ.279 ప్లాన్: నెట్‌ఫ్లిక్స్ బేసిక్ సబ్‌స్క్రిప్షన్, జీ5, జియోహాట్‌స్టార్, ఎయిర్‌టెల్ ఎక్స్‌స్ట్రీమ్ ప్లే ప్రీమియం ప్లాట్‌ఫామ్‌లు యాక్సెస్ పొందొచ్చు. ఒక నెల వ్యాలిడిటీతో ఈ ప్లాన్ తీసుకొచ్చింది. దీని రీఛార్జితో యూజర్లు రూ.750 విలువైన ప్యాక్ ప్రయోజనాలు పొందుతారని ఎయిర్‌టెల్ చెబుతోంది. ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ యాప్ ద్వారా సభ్యత్వం పొందొచ్చు. రూ.598 ప్లాన్: నెట్‌ఫ్లిక్స్ బేసిక్, జీ5, జియోహాట్‌స్టార్, ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే ప్రీమియం సభ్యత్వంతో పాటు అన్‌లిమిటెడ్ 5జీ, అన్‌లిమిటెడ్ కాల్స్‌ను కూడా అందిస్తోంది. దీని వ్యాలిడిటీ 28 రోజులు రూ.1,729 ప్లాన్: నెట్‌ఫ్లిక్స్ బేసిక్, జీ5, జియోహాట్‌స్టార్, ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే ప్రీమియం సభ్యత్వంతో పాటు అన్‌లిమిటెడ్ 5జీ, అన్‌లిమిటెడ్ కాల్స్‌ను కూడా అందిస్తోంది. 84 రోజుల వ్యాలిడిటీతో ఈ ప్లాన్ తీసుకొచ్చారు. టెలికాం రంగంలో జియో, ఎయిర్‌టెల్ మధ్య చాలా కాలంగా గట్టి పోటీ ఉంది. యూజర్లను ఆకట్టుకొనేందుకు ఇరు సంస్థలు తెగ పోటీ పడుతుంటాయి. గత వారంలోనే గూగుల్‌తో జట్టుకట్టి ఎయిర్‌టెల్ క్లౌడ్ స్టోరేజ్ సబ్‌స్క్రిప్షన్ సేవల్ని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపింది. తాజాగా ఆల్‌ఇన్‌వన్ ఓటీటీ ప్లాన్లతో మరింత మంది యూజర్లను రాబట్టుకోవాలని చూస్తోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.